సమయం వదవుతోందనుకుంటాను. బాగా చీకటిగా వుంది. తలపైకెత్తి చూశాను. ఆకాశం మినుకుమినుకుమనే అనేకమైన కళ్లతో నిద్రిస్తున్న భూమిని జాగ్రత్తగా కాపలా కాస్తున్నట్లు అనిపించింది.

ఆశాన్ని తల్చుకునేందుకేనేమో ఒళ్ళు జలదరించింది. ఏముందీ ఆకాశంలో...? నా జీవితంలో లాగే...!

నా మట్టుకు నాకు జీవితమంటే నవ్వటంలాగా తేలికైనది... దు:ఖంలాగా భారమయినది... ఆలోచనలాగా నిగూఢమైనది. అందుకే నేను నా జీవితాన్ని ఆకాశంలో చూసుకొంటాను. కాబట్టే ఒళ్ళు జలదరించింది.

'అనవసరమైన కాలయావన...ప్చ్...' అనుకుని ఇంటిదారి వట్టాను. నాటి అలవాటైన చీకటే... కానీ ఇంటిదారి కొత్తది.

అంతలో ఒక స్కూటర్‌వాలా ... నా వెనకనుంచి! బాగా తాగి వున్నాడేమో... అంత వేగంగా స్పీడ్ బ్రేకర్ దగ్గర బండి ఎగరగానే చేతులు హాండిల్ మీదుగా జారిపోయి, వడిపోయాడు.

దగ్గరికి వెళ్ళి చూసేదాకా అతణ్ణి గుర్తువట్టలేకపోయాను. అతను నాకు కొత్తగా గది అద్దెకిచ్చిన ఇంటి యజమాని. పేరుకు యజమానే అయినా వ్యవహారాలన్నీ అతడి తల్లే చూస్తుంది. ఇతడు సాధారణంగా ఇంట్లో కనిపించడు. 'బిజినెస్‌లో మునిగి తేలుతాడేమో' అనుకున్నాను. 'కానీ...ఇతను....ఇలా...?' ఆశ్చర్యపోయాను.

పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు. అతణ్ణి స్కూటర్ మీద కూచోబెట్టుకుని, జాగ్రత్తగా ఇంటికి తీసుకుని వెళ్ళాను.

గేటు చప్పుడవగానే అప్పటిదాకా సన్నగా వస్తూన్న పాట చప్పుడు ఆగిపోయింది. పైన లైటు వెలిగింది. ఎవరో కిందికి వచ్చారు. ఇంతలో అతనికి కొద్దిగా మెలకువ వచ్చింది.


"మై నేమ్... ఈజ్ ....మౌ...లి! ఐ... నో... వాట్... ఐయామ్...! ఐ...నో..." అని నాతో అన్నాడు. నేను స్కూటర్ స్టాండువేసి, వెనుదిరగబోయేంతలో అతను తూలి నామీద వడ్డాడు. నేను అందుకు సిద్ధంగా లేకపోవటంతో వక్కకి ఒరగబోయేను. అంతలో రెండు చేతులు నన్ను పొదిలి వట్టుకున్నాయి.

చీరకుచ్చెళ్ళ మృదువైన స్పర్శ!

చేతివేళ్ల నునువు! చెక్కిలి మీది మెరుపు! నాసికే కాదు... మనసుకి కూడా ఏదో వరిమళం సోకినట్లనిపించి, వెంటనే తేరుకున్నాను. ఆమె చప్పున నన్నొదిలింది.

"తా...గిన వోణ్ణి నే...నయితే... పావం! ఆయన్ని... వట్టు...కుంటా... లేం? న...న్ను వట్టు...కో! ఊ... వట్టు...కో! "గొణిగినట్టుగా అన్నాడతను. ఆమె టవటవ రెవ్పలు తాటించి, నావేపు ఆందోళనగా చూసింది. చల్లగా వుందా చూవు...! కానీ చెవిదాకా లాగి వొదిలిన బాణంలా... దేన్నో కోస్తోంది.

"ఏ...వనుకోకు గురూ... సారీ! నీకు... సా...రీ... చెప్పటానికి ....మా...విడకి నో...రు లేదు...! ఈ...సారి...కి వొదిలెయ్...వద...చె...బు...త...!"అని అతను తూలుతూ, ఆమె సహాయంతో వెళ్ళిపోయేడు. స్థాణువయ్యాను నేను! ఆశ్చర్యంతో పాటు 'నిజంఎంత కఠినంగా వుంటుంది సుమా' అన్పించింది. అదీ చైత్రతో నా వరిచయం ప్రారంభమయిన విధానం!




నాకు అశాంతితో ఆ రాత్రంతా నిద్రవట్టలేదు.

మాటలు రాని చైత్ర! ఎక్కువగా ఏకాంతాన్ని అభిలషించే నేను, మూగవాణ్ణయితే ఇలా అందరితో వనికిమాలిన మాటలు మాట్లాడే బాధ తప్పేది కదా అనుకునే నేను, చైత్రకి మాటలురాకపోవటాన్నిఅంగీకరించలేకపోయేను. 'దేవుడు ఆమెకి కళ్ళతో మాట్లాడటం ఎలాగో నేర్పించి, నోటి మాట లాగేసుకున్నాడేమో అనిపించింది.

ఆ తరువాత ప్రతీ విషయమూ నా విషయంలో మాత్రం గొప్ప ఉద్వేగంతో జరిగిందే. చైత్రని చూసే అవకాశం మళ్ళీ వెంటనే కలుగలేదు. వాళ్ళు పై పోర్షనులో వుంటారు. ఆమె మెట్లు దిగడం కాదుగదా... ఆ గది కూడా దాటి బయటికి రాదు. ఆమె భర్త తాగి ఎప్పుడో తప్ప ఇంటికి రాడు. అదే వాళ్ళిద్దరి మధ్య తేడా!

ఇక ఆమె మునలి అత్తగారు, క్రింది వాటాలోనే వున్న కూతుర్ని తీసుకుని వూరి మీద వడి, వచ్చిన సినిమా వచ్చినట్టు చూస్తుంది. ఆవిడ అల్లుడు అద్దె ఖర్చు తప్పుతుంది గదానీ అత్తగారు పిలవగానే వొచ్చి, ఆ ఇంట్లో కాపురం పెట్టేడు. ఎలాగూ అద్దె ఖర్చు తప్పింది కదాని కూతురు వనిమనిషిని పెట్టుకుంది. తల్లీకూతుళ్ళకి ఆ విధంగా కావాల్సినన్ని సినిమాలు చూసే వీలు చిక్కింది.

అయితే నేనో విషయం గమనించాన. ఎవరూ ఇంట్లో వుండని అలాంటి సమయాల్లో చైత్ర గదిలోంచి.... అతి తక్కువ వాల్యూమ్‌తో... సన్నగా... అస్పష్టంగా ఒక పాట వినిపిస్తుంది. తన మౌనాన్ని తానే ప్రశ్నించుకొంటూ ఓ మనసు పాడే పాట! హృద్యంగా వుంటుంది అది!

మాట్లాడలేని చైత్రలాంటి విశిష్టమైన వ్యక్తి ఆ పాట వినడం... ఎంతో అర్థవంతంగా తోచింది నాకు. రెండుసార్లు వినగానే ఆ పాట నాక్కూడా ఎంతో ఇష్టమైపోయింది. కానీ

... విన్న పాటనే మళ్ళీ వినడం ...... పాటలో క్రమం లోపించడం... నా కెందుకో అసహజంగా తోచింది.

అదే నాలో మరింతగా ఆసక్తిని రేకెత్తించింది.

'చైత్రతో మాట్లాడాలన్న కోరిక కూడా తీరుతుందని నిర్ణయించుకుని, ధైర్యం చేసి, మెట్లెక్కి, పైకి వెళ్ళాను.

నేను మెట్లెక్కుతుండగానే పాట ఆగిపోయింది.

ఆమె లోపల ఉన్నట్లుంది. అలికిడికి బయటకు వొచ్చి, నన్ను ఆశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ చూసింది.

చైత్రతో నేను ఎలా మాట్లాడతానసరే... కానీ నాతో ఆమె మాట్లాడితే బావుణ్ణన్న కోరిక ఎలా తీరుతుంది? నాకు బాధతో కూడిన నవ్వు వొచ్చింది. అందుకే ఏం మాట్లాడాలో తోచలేదు.

"నమస్తే..." అన్నాను. అదే చూవు ... అయోమయంగా! ఆ చూపుల్లో దాచినా దాగని అమాయకత్వం చూసి, నేను ధైర్యం తెచ్చుకొన్నాను.

"మీరు ఇందాకా విన్న పాట బావుంది... ..."

ఆమె మౌనంగా రెప్పలల్లార్చింది. తనకి ఇష్టమైన పాటని మరొకరు మెచ్చుకోవటం ద్వారా కలిగిన సంతృప్తితో కాబోలు...!

"మీకు అభ్యంతరం లేకపోతే... ఓసారి ఆ కేసెట్ ఇస్తారా? విని ... వెంటనే తిరిగి ఇచ్చేస్తాను..." అన్నాను బుద్ధిగా, అసలు విషయం ఎలా అడగాలో అర్థం కాక.

ఆమె కంగారుగా తలెత్తి చూసింది. ఏదో చెప్పాలనీ నోరు తెరిచి, ఆగిపోయి, నిస్సహాయంగా మొహం వక్కకి తిప్పుకుంది. ఆమె కష్టం చూసి జాలేసింది నాకు.

"ఫర్వాలేదు! మీ కభ్యంతరమైతే వద్దుగానీ... మిమ్మల్నొకటి అడగనా?"

"... ... ..."

"మీకా పాటంటే చాలా ఇష్టం ఉన్నట్లుంది... కానీ..."

ఇంతలో వెక్కిళ్ళు విన్పించాయి. ఆమె ఏడుస్తోందన్న విషయం గమనించి, నాకు కంగారు పుట్టింది. కానీ... ఎందుకు...? అదే అర్థం కాలేదు. ఆమె చెప్పను కూడా లేదు. కనీసం ఆ ప్రయత్నమైనా చేయలేదు.

అయినా నేనెంత బుర్ర లేని వాణ్ణయితే అలా అడిగివుంటాను. మాటలు రాని ఒక స్త్రీ... నా ప్రశ్నలకు అడగ్గానే ఇబ్బంది వడకుండా సమాధానం చెప్తుందని ఎలా ఊహించాను? ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

చేసేదిలేక నేను వచ్చేసేను. చివరి

మెట్లు దిగుతుండగా విన్పించింది. పాట తాలూకు నవ్వడి! మనసు మాత్రమే వసిక ట్టగలిగేటంత తక్కువ స్థాయిలో!

చిత్రం ఏమిటంటే ఆ పాటలో సంగీతం లేదు. కానీ సంగీతంతో పనిలేని ఆలాపన ఉంది. నదీ తరంగాలని తాకుతూ సాగిపోయే పిల్లగాలి లాంటి ఆలాపన ఆ పాటక్కి ఎక్కడలేని ఆర్ద్రతని తెచ్చిపెట్టింది. ఎంత ప్రయత్నించినా నేను ఆ పాటని స్పష్టంగా వినలేకపోయాను.

ఆ పాట అంత గాఢంగా నా గుండెలో నాటుకుపోవటంతో పాటు... చైత్ర విషయం కూడా మనసులో దేన్నో కదిలిస్తోంది. మౌనంగా ఆమె చూసే చూపులు దశాబ్దాలుగా నాలో పేరుకుపోయిన స్తబ్దత తాలూకు కోటగోడకి నిప్పటించేస్తున్నాయి.

అంతలో నా దృష్టి నన్ను రవంత అనుమానంగా చూసే పని మనిషి మీదకి మళ్ళింది. నన్ను అనుమానిస్తే... అనుమానించింది గానీ మనిషి మాత్రం మంచిది. చైత్రంటే అభిమానమూ, గౌరవమూ ఉన్నాయామెకి. ఓసారి మాటల మధ్యలో అసలు విషయం చెప్పింది...

"భలేవారే...! వాళ్ళింట్లో ఏ రికార్డర్లూ లేవూ...".

అది విన్న వెంటనే నా తలకెక్కలేదు. అర్థం కాగానే నా మెదడులో పెద్ద విస్ఫోటనం జరిగినట్లు అదిరిపడ్డాను. కళ్ళ ముందర గుప్పిట తెరిచి చూపించినంత స్పష్టంగా తెలుసు నాకు... ఆ పాట ఆమె గదిలోంచే వస్తోందని దాని అర్థం...?

నాకో విషయం బోధపడింది...... చైత్ర మంచి గాయకురాలనీ! 'ఇలా జరిగితే బావుణ్ణన్న కోరిక అలాగే నెరవేరితే ఎగిసే సంతోషపు కెరటం... నా అంతరంగంలో. కానీ అదెలా సాధ్యం?

ఎప్పటిలా ఈసారి ఆమె గదిలోంచి పాట విన్పించలేదు. చాలాసేపు ఎదురు చూసేను. కానీ మౌనం తప్ప మరేమి విన్పించలేదు. నా ఉనికిని ఆమె గుర్తించిన విషయం తేలిపోయింది.

ఒక నిశ్చయానికి వచ్చి, మెట్లెక్కి, పైకి వెళ్ళాను. తలుపులు తెరిచే ఉన్నాయి.

నన్ను చూసి నిష్ఠూరంగా తల తిప్పుకుంది చైత్ర. నేను బాధ పడకూడదని కఠినంగా నిర్ణయించుకుని, నా చేతిని ముందుకు సాచేను. ఆమె ఆశ్చర్యపోయింది.

సమయానికి అందుబాటులో ఉన్న చేమంతి పువ్వుని ఆమెకి అందిస్తూ... చిన్నగా నవ్వి తాపీగా చీకట్లో బాణం వదిలేను.

"చైత్రగారూ! మొన్న మీరు పాడిన పాట అద్భుతంగా ఉంది. ఆ రోజే మిమ్మల్ని అభినందించాల్సింది...! కానీ అది మీరే పాడేరని తెలుసుకోవటానికి ఇంత కాలం పట్టింది. అందుకోండి..." అన్నాను. ఇంతలో గేటు చప్పుడైంది.

చైత్ర చప్పున నా చేతిలోని పువ్వుని అందుకుని నావైపు చూసింది. ఆమె కళ్ళల్లో నీళ్ళూరేయి. గొణిగినట్లుగా 'థాంక్స్' అని లోనికెళ్ళిపోయింది. సంభ్రమంతో నా గొంతులోంచి చిన్న కేక బైటకి వచ్చింది. అది చాలు నేను ఆనందంతో నాట్యం చేయడానికి.

అపుడే సినిమా టికెట్లు దొరక్కపోవడంతో తిరిగి వొచ్చిన చైత్ర అత్తగారు పైకి వచ్చి, నన్ను అనుమానంగా చూసింది.

"కు... ళాయిలో నీళ్ళూ... అదీ... రావటంలేదు...! పైన టాంకు విప్పలేదేమోననీ... అని ఏదో నసిగేను.

** ** **

క్రమంగా నేనంటే పూర్తిగా నమ్మకం కుదిరేక, తన గురించి పూర్తిగా చెప్పింది చైత్ర.

"మా అమ్మా... నాన్న చిన్నప్పుడే పోయారు. మామయ్య పెంచారు నన్ను. పీరూహించే ఉంటారు... చిన్నప్పుడు నేను మంచి గాయకురాలిని. నన్ను ఏవేవో ప్రోగ్రాంలో పాటలు పాడించి, డబ్బు చేసుకొనే వాడు మామయ్య. కానీ నాకు పెళ్ళి చేయాల్సి వచ్చేసరికి ఇరకాటంలో పడ్డాడు. ఆ సమయంలోనే నా పాటలు విని, నన్ను ప్రేమిస్తున్నానని ఒకతను మామయ్యని అడిగేడు. అడగని వాడిదే పాపం అన్నట్లుగా నన్ను మామయ్య అతనికి దానం చేసేడు. కానీ...

...కొన్ని నిజాలు ఎంత దారుణంగా ఉంటాయో... అపుడే నా జీవితం నాకు తేటతెల్లం చేసింది. ఆయనసలు మగవాడే కాదు. తనకి ఉద్యోగం రావటానికి ఒకడికి నన్ను 'ఎర'ని చేసి చూపారు. కేవలం ఆ ప్రయోజనం కోసమే అతను ముందూ, వెనకా లేని నన్ను ఎన్నుకున్నాడని తరువాత నాకు అర్థమయింది. నేను ఒప్పుకోలేదు. చంపుతామని బెదిరించారు. అయినా, అతని తల్లీ నా మీద పడి, గొంతు నులిమారు. అప్పుడే ఎవరో రావటంతో.... నా సంగతి సగంలోనే వదిలేశారు. అప్పుడు మూగపోయినదీ నా మనసు... మనుష్యులూ.. వీళ్ళ అవసరాలూ... అందుకు వీళ్ళ ఆలోచనలూ.. వీటితో విసిగిపోయాను. అవసరం తప్ప మరేదీ వీళ్ళని కలిపి ఉంచలేదని నిర్ణయించుకుని, నాదైన మౌనప్రపంచాన్ని సృష్టించుకొన్నాను. ఆ తరువాత ఆయనకి ఉద్యోగం వచ్చి నాతో అవసరం తీరిపోయింది. నాకు 'షాక్' వల్ల మాట పడిపోయిందని నిర్ధారించుకొని, ఆ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

నిజం చెప్తున్నాను... కేవలం సూర్యోదయాల్ని చూడడం కోసం... వెన్నెల్లో తడవడం.. ఏటి ఒడ్డున పాటలు పాడుకొనే అమృత ఘడియ కోసం నాకు మరీమరీ బ్రతకాలనిపిస్తుంది. కానీ..."

నేను మంత్రముగ్ధుణ్ణయి ఆమె మాటలు విన్నాను. గుండెలో లక్షలాది పావురాలు.. ఒక్కసారిగా రెక్కలు విప్పుకొని ఎగిరిన అనుభూతి కలిగింది. 'నీ వేదన నాకు ఉందని' చెప్పాలన్పించేటంత ఉద్వేగం...! ఎందుకో తెలీదు... కళ్ళలో నీళ్ళు చిప్పిల్లేయి. ఇంకా తడి ఆరని మనసు తాలూకు ఆర్ద్రతని పెదాల్లోకి నింపుకుని... చప్పున ఆమె చేతినందుకుని ముద్దు పెట్టుకున్నాను.

అపుడే గుమ్మంలో ఆమె అత్తగారి నీడ పడింది. ఆ తరువాత ఆవిడే లోపలికి వొచ్చింది.

"ఊ..." అని ఓసారి దీర్ఘంగా నిట్టూర్చి...

"అయితే ఆ రోజు నీకు మాట పడిపోలేదన్న మాట... నిన్న వీళ్ళి పైన చూసినపుడే అనుమానం వచ్చింది. అందుకే సినిమాకు వెళ్తున్నట్లు నటించాను...." అని నా వేపు తిరిగి కఠినంగా... "ముందు నీవు ఇంట్లోంచి తక్షణం వెళ్ళిపో..." అంది.

నాకు నోట మాటరాలేదు.

ఏదైనా అబద్ధం ఆడి, ఆవిణ్ణి శాంతపరుద్దామనుకున్నాను. కానీ అది అయ్యే పని కాదని నిశ్చయించుకున్నాను.

"చూడండీ.. ఇల్లు ఖాళీ చేయడం నాకు సమస్యకాదు. కానీ... ఇక్కడ జరిగినదాని గురించి మీరు ఏవేవో ఊహించుకునీ, తెలికేదైనా అపకారం తలపెడితే మాత్రం బావుండదు" అని హెచ్చరించి వెను దిరిగాను. నేను గేటు దాటుతుండగా ఆ విన్పించాయి... "ఇంతచేసీ అది తిరిగి ఎలా ఎలా మాట్లాడుతుందో నేనూ చూస్తాను..." అనే మాటలు.

రాత్రంతా నేను ఓ స్నేహితుడి ఇంట్లో ఉన్నాను. కానీ వాళ్ళు చైత్రని హింసిస్తారేమో అనే బాధతో రాత్రంతా నరకం అనుభవించాను.

'నా వల్లే కదా చైత్ర జీవితం ఇరుకున పడిందీ' అన్నభావం నన్ను పురుగులా దొలిచేసింది. ఎంత ఆలోచించినా ఏం చేయాలో తోచలేదు. తెలతెలవారుతుండగా ఓ ఆలోచన వచ్చి, వణికిపోయేను... అలా జరుగుతుందా? అసలు సాధ్యమేనా? తను ఒప్పుకుంటుందా?

మరునాడు పదవుతుండగా వాళ్ళింటికి వెళ్ళాను... ఇంటి అద్దె, అదీ అన్నీ ఇచ్చేసి, ఖాళీ చేయటానికి ఇంట్లో ఎవరూ లేరు. పనావిడ మాత్రం నా కోసమే ఎదురు చూస్తున్నట్లుంది.. నన్ను చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఆవిడ చెప్పిన విషయం , విని, దిగ్భ్రాంతి చెందాను.

నిజమా? నిజమా?? నిజమా???

రివ్వున హాస్పిటల్‌కి పరుగెత్తాను. అక్కడ దిక్కులేని దాన్లా పడివుంది. చైత్ర.. ఓ మంచమ్మీద. ఆమె దగ్గర ఎవరూ లేరు. నన్ను చూడగానే కళ్ళు మూసుకుంది. మూసుకున్న కళ్ళనించి ఒక నీటి చుక్క జారి ఆమె కురుల్లో ఇంకిపోయింది.

"ఏ... ఏమయింది చైత్రా..." నా గొంతుకి దుఃఖం అడ్డు పడుతోంది. వెక్కిళ్ళరూపంలో ఏదో భావం మాటల్ని మింగేస్తుంది.

నాతో మాట్లాడాలనీ నోరు తెరిచింది. మెల్లిగా!

ఎర్రగా ఉంది నోరు.. కా...నీ...

నా...లుక ... లే...దు!!

ఏదో అనబోతున్న నేను సర్పదష్టుడిలా ఆగిపోయేను. ఇదా ముసలి పీనుగ నిన్న అన్నమాటలకి అర్థం! తనకి శాశ్వతంగా మౌనాన్ని మిగిల్చిందన్న మాట.

దీనికంతటికీ కారణం నేను కదూ? ఇప్పుడు ఏం చేయాలి? ఏం దానం చేస్తే ఇంతదోషం తీరుతుంది... గోవులా... భూమిలా.. నన్ను నేను తప్ప!

"వద్దు చైత్రా! నువ్ ఇబ్బందిపడొద్దు... నేనే మాట్లాడతాను.." అని ఆగి, గుండెల్నిండా ఊపిరి తీసుకొని, మెల్లిగా చెప్పేను. "కొందరి ఆలోచన ప్రకారం నేను మంచివాణ్ణి అయితే... మరికొందరి ఆలోచన ప్రకారం నేను చెడ్డవాణ్నే కావచ్చు. కానీ కొందరి దృష్టిలో అయినా ఆత్మీయునిగా మిగలాలన్నది నా కోరిక..'

"... .... ...."

"చైత్రా! నిన్ను మించిన ఆత్మబంధువులెవరూ నాకు ఇప్పుడు లేరు. ఒక మెట్టు పైనో, కిందో నువ్వున్నా.. నేనున్నా. నేను. నిన్ను చేరటం నాకు కావాలి. ఇది ప్రేమకాదు. నన్ను నేను కనుగొనే ప్రయత్నంలో నీలో నన్ను వెదుక్కోగలిగాను. ఇది నీకు నాకు.. ఇష్టమే కదూ...?" కొద్ది క్షణాలు భారంగా గడిచాయి.

చైత్ర మెల్లిగా లేచి, వంగి, కాగితం మీద రాయసాగింది...

"నా... కనురెప్పలు పెదాలై, నా కంటి పాప మీద నిల్చిన మీ రూపాన్ని తనివిదీరా ముద్దిడుతున్నాయి. నోరేమో మూగది. ఇక... సమాధానం ఎలా చెప్పనూ..?"

కలం పక్కన ఉంచి, మరింత ముందుకి వంగి, నా నుదుటి మీద ముద్దు పెట్టుకుంది.

రేగిన గాయం తాలూకూ ఎర్రని రక్తం ఆమె పెదవి మీదా... నా నుదుటిమీదా... ఏదో చెప్పాలని చూసేను.

తన కళ్ళల్లో నీళ్ళు...! నా కళ్ళల్లో నీళ్ళూ!!

ఎటు చూసినా నీళ్ళే..!!! గోదావరి వరదొచ్చి ప్రపంచాన్ని ముంచెత్తిందా ఏం... అన్పించింది. ★